

సెంచూరియన్‌లో విశ్వసముద్ర సిబ్బందికి శిక్షణ - 8లో

దేశంలో పోర్టులు, ప్రాజెక్టుల నిర్మాణంపై సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది.



వేతన ఒప్పందం

కర్లాం పరిసరాల్లో ఉన్న వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమలో యాజమాన్యం, కార్మికుల మధ్య వేతన ఒప్పందం జరిగింది. - 8లో



అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు

జిల్లాలోని అసంఘటితరంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులను పొందాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. - 8లో

న్యూస్‌రీల్

ముగిసిన ఐఈఆర్‌పీ పోస్టుల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుల పరిశీలనలో సమగ్ర శిక్ష సిబ్బంది

విజయనగరం అర్బన్: జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 15 ఐఈఆర్‌పీ (ఇన్‌క్యూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్న సంగతి తెలిసిందే. అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయంలో గురువారం ముగిసింది. ఐఈఆర్‌పీ పోస్టుల్లో ఎంఆర్ కేటగిరికి 43 మంది, వీఐ/హెచ్ఐ కేటగిరికి 50 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెండోరోజున ఎంఆర్‌కేటగిరి పోస్టులకు 13 మంది, వీఐ/హెచ్ఐ కేటగిరికి 14 మంది దరఖాస్తులు పరిశీలించామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.

9లోగా ఈకేవైసీ నమోదు

విజయనగరం ఫోర్ట్: ఈ-క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 50 శాతం మంది మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారని చెప్పారు. మిగిలిన రైతులందరూ ఈ నెల 9వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. దీనివల్ల విపత్తుల సమయంలో పంట నష్టపరిహారంతో పాటు, బీమా, జీరో వడ్డీ పంట రుణాలు మంజూరవుతాయన్నారు.

ఎలక్ట్రికల్ స్కిల్స్‌తో ఉపాధి

- జేఎన్‌టీయూ జీవీ ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ పద్మజ



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ పద్మజ

విజయనగరం అర్బన్: ఎలక్ట్రికల్ స్కిల్స్ ఉన్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ పద్మజ అన్నారు. నాబార్డు సహకారంతో ఆర్‌కే టౌన్‌షిప్‌లోని జీఎంఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణ కేంద్రంలో రెండు నెలల ఉచిత శిక్షణ తరగతులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రికల్ నైపుణ్య శిక్షణ నిరుద్యోగ యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జీవితంలో ఒకరి మీద ఆధారపడకుండా తమంతట తాము బతకడానికి శిక్షణ తోడ్పడుతుందన్నారు. నాబార్డు సహకారంతో అందిస్తున్న శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాబార్డు డీడీఎం టి.నాగార్జున మాట్లాడుతూ జీఎంఆర్ అందిస్తున్న వివిధ నైపుణ్య కార్యక్రమాలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.జయకుమార్, అసోసియేట్ మేనేజర్ సీహెచ్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జి కె.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



అభినందనలు తెలియజేస్తున్న పారామెడికల్ ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అనిలా సునందని గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం ప్రభుత్వ వైద్యకళాశాలలో డెర్మాటాలజీ విభాగం హెచ్‌ఓడీగా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చేరోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తానన్నారు. ఆమెకు ఆస్పత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

విక్రాంత్‌కు అభినందనల జల్లు

పాలకొండ: ప్రభుత్వ విప్‌గా ముఖ్యమంత్రి అవకాశం కల్పించడం ఆనందంగా ఉందని, పదవితో మరింత బాధ్యత పెరిగిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆయనకు పాలకొండ, రాజాం నియోజక వర్గాలకు చెందిన నాయకులు, అధికారులు గురువారం అభినందనలు తెలిపారు. ఏపీ ఎన్‌జీఓ సంఘ నాయకులతో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ 2024లో జరగనున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేస్తానన్నారు.

అంగన్‌వాడీల్లో ఉద్యోగ భాగ్యం

2019 నుంచి 2023 సంవత్సరం వరకు అంగన్‌వాడీ పోస్టుల భర్తీ ఇలా...

సంవత్సరం	కార్యకర్త	ఆయా	మినీ కార్యకర్త
2019	7	25	3
2020	28	93	2
2021	77	3	31
2022	31	123	6
2023	21	61	15
మొత్తం	164	305	57

- నాలుగున్నరేళ్లలో వందలాది మందికి ఉద్యోగాలు
- 526 మంది కార్యకర్తలు, ఆయాలుగా నియామకం
- ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్న ప్రభుత్వం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి, రెండేళ్లకోసారి భర్తీచేసే పరిస్థితి
- కార్యకర్తల పోస్టులు 164, ఆయా పోస్టులు 305 భర్తీ
- మినీ అంగన్‌వాడీ కార్యకర్తలుగా 57 మంది నియామకం



వందానపేట అంగన్‌వాడీ కేంద్రంలో టీఎల్‌ఎంతో బోధన

విజయనగరం ఫోర్ట్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ విప్లవాన్ని తెచ్చింది. సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ జీవితాన్ని ప్రసాదించింది. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి లక్షలాది మంది యువతకు ఉపాధి మార్గం చూపింది. వైద్య రంగంలో జీరో వేకెన్సీ పాలసీని తీసుకొచ్చి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఖాళీ అయిన వెంటనే పోస్టులను భర్తీచేసే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అన్నిశాఖలతో పాటు స్త్రీ, శిశు సంక్షేమశాఖలోనూ అదే ఒరవడిని కొనసాగిస్తోంది. పోస్టులు ఖాళీ అయిన వెంటనే భర్తీచేస్తోంది. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో వందలాది పోస్టులు భర్తీచేసింది. గత టీడీపీ ప్రభుత్వం ఏడాదికి, రెండేళ్లకోసారి అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేసేది. ప్రస్తుత ప్రభుత్వం పోస్టు ఖాళీ అయిన వెంటనే భర్తీ చేస్తోంది. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తోంది.

అంగన్‌వాడీల్లో పోస్టుల భర్తీ ఇలా..

జిల్లాలోని 2,499 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం సేవలందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణప్లస్ పథకాల కింద పౌష్టికాహారం పంపిణీతో పాటు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను వెంటవెంటనే భర్తీ చేస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 526 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులను భర్తీ చేసింది. ఖాళీలు అయిన రెండు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి అర్హులను ఎంపిక చేస్తోంది. స్థానికులైన వివాహితులను కార్యకర్తలు, ఆయా పోస్టుల్లో నియమిస్తోంది. ఇప్పటివరకు 164 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, 305 హెల్పర్ (ఆయా) పోస్టులు, 57 మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్ పోస్టులను భర్తీ చేసింది.

పారదర్శకంగా నియామకాలు



అంగన్‌వాడీ నియామకాలు పారదర్శకంగా ప్రభుత్వం చేపట్టింది. అంగన్‌వాడీ ఆయా నుంచి హెల్పర్‌గా పదోన్నతి వచ్చింది. ఎటువంటి సిఫార్సు లేకుండా పదోన్నతి రావడం చాలా సంతోషంగా ఉంది. నాలాగే చాలా మందికి కార్యకర్తలుగా పదోన్నతి వచ్చింది.

– అక్కిన లక్ష్మి, కార్యకర్త, బొత్సపేట అంగన్‌వాడీ కేంద్రం

హెల్పర్ ఉద్యోగం వచ్చింది



గంట్యాడ అంగన్‌వాడీ కేంద్రం-2లో హెల్పర్‌గా 2022 అక్టోబర్ 28వ తేదీన ఉద్యోగం వచ్చింది. సొంత గ్రామంలో ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది. నా కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు చక్కని సేవలందిస్తున్నాను.

– తిరుమల, అంగన్‌వాడీ హెల్పర్, గంట్యాడ

రెండు నెలలకు ఓసారి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రతీ రెండు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి భర్తీచేశాం. నాలుగున్నరేళ్ల కాలంలో 500కు పైగా పోస్టులు భర్తీ చేశాం. ఖాళీలు ఏర్పడిన వెంటనే పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తున్నాం.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

గిరిపుత్రులకు తీపికబురు

- పార్వతీపురం మన్యం జిల్లాకు రెండు చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు
- రెండు యూనిట్‌లకు ఎకరా చొప్పున భూమి కేటాయింపు
- ఒక్కో యూనిట్ విలువ రూ.4.65 కోట్లు
- ఒక్కో యూనిట్ పరిధిలో 200 మందికి నేరుగా ఉపాధి
- చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీతో గిరిజనులకు ఆర్థిక ఊతం



వర్చువల్ విధానంలో ప్రాసెసింగ్ యూనిట్ల శిలాఫలకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి

పార్వతీపురంటౌన్: చిరుధాన్యాలు సాగుచేసే రైతులు, నిరుద్యోగులకు శుభవార్త. మన్యంలో పండే చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. పార్వతీపురం మండలం చందలంగి, పాలకొండ మండలం అట్టలిలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లకు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఇవి కొద్ది నెలల్లో ఏర్పాటుకానున్నాయి. వీటివల్ల చిరుధాన్యాలకు డిమాండ్ పెరగడంతో పాటు సాగు లాభదాయకంగా మారుతుంది. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుంది. ఆరోగ్యకర ఆహారం ప్రజలకు అందుతుంది. బహుళ ప్రయోజనాల కల్పనే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రైతులందరికీ మేలు కలిగేలా..

పార్వతీపురం, పాలకొండలో ఏర్పాటుచేయనున్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లకు 50 సెంట్ల చొప్పున ప్రభుత్వం భూమి కేటాయించింది. ఒక్కో యూనిట్ విలువ రూ.4.65 కోట్లు. మొత్తం రూ.9.30 కోట్ల విలువైన యూనిట్లను నెల్లూరుకు చెందిన అజయ్‌బాబు ఇండస్ట్రీస్ ఏర్పాటుచేయనుంది. ఒక్కో యూనిట్‌లో దాదాపు 2 వందల మందికి నేరుగా ఉపాధి లభించనుంది. మరోవైపు రైతుల నుంచి గిట్టుబాటు ధరకు చిరుధాన్యాలను కొనుగోలు చేస్తారు. మిల్లెట్ పౌడర్, మిల్లెట్ మాల్ట్, మిల్లెట్ ముద్దలు, మిల్లెట్ బిస్కెట్స్, మిల్లెట్ జావ, మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ దోసెలు తదితర ఆహారపదార్థాల తయారీకి అనువైన ఉత్పత్తులను ఇక్కడ తయారు చేసి మార్కెట్ చేస్తారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం ఇలా...

పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు మండలంలో అత్యధికంగా 2,092 ఎకరాల్లోను, పాచిపెంటలో 1358, గుమ్మలక్ష్మీపురంలో 369, కురుపాంలో 50, కొమరాడలో 273, పార్వతీపురంలో 44, సీతంపేట మండలంలో 83 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఇందులో భాగంగా చిరుధాన్యాల సాగు, ఆహార ఉత్పత్తుల వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రజలందరికీ ఆరోగ్యకర ఆహారాన్ని అందజేసే బృహత్తర బాధ్యతను నెరవేర్చే చర్యలు చేపట్టింది.

ఏడాదిన్నరలోపే...

ఈ యూనిట్ల వల్ల ఒక్కోయూనిట్‌కు 200మంది చొప్పున 400 మందికి నేరుగా ఉపాధి చేకూరనుంది. స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చేలా ప్రభుత్వం చట్టం చేసింది. 18 నెలల లోపే ఈ యూనిట్లను ప్రజలకు, రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టింది.

జగనన్నే మళ్లీ రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

- ఈ నెల 11 నుంచి వచ్చేనెల 10వరకు 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' కార్యక్రమం నిర్వహణ
- ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేసిన మంత్రి బొత్స
- పాల్గొన్న జెడ్పీచైర్మన్, ఎంపీ

చీపురుపల్లిరూరల్ (గరివిడి): రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లలో ప్రతి నియోజకవర్గానికి సంక్షేమ పథకాల కింద రూ.వెయ్యికోట్లు అందజేసినట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం అందించని అభివృద్ధి, సంక్షేమ పాలనను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగిస్తోందన్నారు. మరోసారి చారిత్రక ఘట్టానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. గరివిడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ప్రతి సచివాలయం పరిధిలో 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' కార్యక్రమంలో భాగంగా 'ఆపుబాబు నీ బూటకం-జగనన్నే మా నమ్మకం' అనే అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులంతా సమైక్యంగా సంక్షేమ, అభివృద్ధి పాలన వివరిస్తూ ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా ముందుకు సాగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే మన లక్ష్యమన్నారు. మనం ఏ పని చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా, కండువా తప్పనిసరిగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంతో పోల్చితే నక్కకి నాకలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా సరే మనం చేసే కార్యక్రమాలు వ్యక్తిగతంగా ప్రతిఒక్కరికీ లబ్ధికలిగిస్తున్నాయని, అది వారి మనస్సాక్షికి తెలుసన్నది గర్వంగా చెప్పన్నానన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.3వందల కోట్లతో ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చీపురుపల్లిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

- విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతీ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ జెండా వెగరవేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన నాయకులు చెప్పే అబద్ధాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నిమ్మాన దాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఇప్పిలి వెంకటనర్సమ్మ, మీసాల విజయలక్ష్మి, తాడ్డి కృష్ణవేణి, వలిరెడ్డి శిరీష, వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, డీఎల్‌డీపీ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీలు జి.శ్రీరాములునాయుడు, టి.తిరుపతి రావు, రామకృష్ణరాజు, పార్టీ మండలాధ్యక్షులు ఇప్పిలి అనంతం, కోట్ల వెంకటరావు, కొణిశ కృష్ణంనాయుడు, స్వామినాయుడు పాల్గొన్నారు.

119 పంచాయతీల్లోనూ జెండా ఎగురవేద్దాం



చీపురుపల్లి నియోజకవర్గలలోని 119 పంచాయతీల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేద్దాం. అక్టోబర్ 11 నుంచి నవంబర్ 10 వరకు జరగనున్న 'అపు బాబు నాటకం-జగనన్నే మా నమ్మకం' అనే కార్యక్రమంలో భాగంగా ప్రతీ సచివాలయం పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లాలి. ప్రతి సచివాలయం పరిధిలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించాలి. సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేయాలి. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం కోసం ప్రతీ ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి. ఇటీవల కొంతమంది టీడీపీ నాయకుల భాష మారిపోయింది. కనీసం నియోజకవర్గ ఎల్లలు కూడా తెలియని ఆ నాయకులకు ప్రజలే బుద్ధిచెబుతారు. 2024లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త నుంచి నాయకుని వరకు చిత్తశుద్ధితో పనిచేయాలి.

– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, విజయనగరం



హాజరైన ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

4 రోజుల్లో 43,505 మందికి వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు అనూహ్య స్పందన
- గ్రామాలు, పట్టణాల్లో 105 వైద్య శిబిరాలు
- 39వేల మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- 1747 మందికి తదుపరి చికిత్సకోసం పెద్దాస్పత్రులకు తరలింపు
- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంపాంలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరంలో వృద్ధునికి అందజేసిన కళ్లద్దాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: జిల్లా వ్యాప్తంగా గత నెల 30వ తేదీ నుంచి ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, ఈ కార్యక్రమాన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టంచేశారు. సెప్టెంబర్ 30 నుంచి గురువారం వరకు నాలుగు రోజులపాటు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 101, పట్టణ ప్రాంతాల్లో 4 సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. ఈ శిబిరాల్లో 43,505 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలను సాధారణ, ప్రత్యేక వైద్య నిపుణులు చేశారన్నారు. సాధారణ వ్యాధులకు సంబంధించి 18,006, రక్తపోటుకు సంబంధించి 6,972, మధుమేహానికి సంబంధించి 5,372, స్త్రీల ఆరోగ్య సమస్యలపై 2,310 మందికి, చిన్నపిల్లల ఆరోగ్య సమస్యలపై 1636 వైద్య పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు సంబంధించి 952, జ్వరాలకు సంబంధించి 863, కంటి సమస్యలపై 7,394 మందికి వైద్యపరీక్షలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ నాలుగు రోజుల్లో 39,306 మందికి వ్యాధినిర్ధారణ పరీక్షలు చేశారని చెప్పారు. బి.పి.కోసం 13,065, జీఆర్‌బీఎస్‌కు 12,643, మలేరియాకు 885 మందికి, 319 మందికి డెంగీ నిర్ధారణ పరీక్షలు, 945 మందికి యూరిన్, 734 మందికి ఈసీజీ, 10,453 మందికి హెచ్.బి, 262 మందికి ఏఎఫ్‌బి పరీక్షలు నిర్వహించారన్నారు. వైద్యుల సిఫారసు మేరకు 1747 మందిని తదుపరి చికిత్స కోసం ఆరోగ్యశ్రీ, ఇతర ఆస్పత్రులకు పంపించామన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో గతంలో ప్రకటించిన శిబిరాలకు అదనంగా ఒక్కో పట్టణ ప్రాంత పీహెచ్‌సీ పరిధిలో రెండు నుంచి మూడు శిబిరాలను అదనంగా నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఈ శిబిరాలకు వస్తున్న కారణంగా రద్దీని నివారించేందుకు మరిన్ని ఎక్కువ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. జిల్లా ప్రజలు తమ సమీపంలో జరిగే ఈ శిబిరాలకు హాజరై తమ ఆరోగ్య సంబంధ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



విజయనగరం రూరల్: దుప్పాడ గ్రామ సచివాలయం వద్ద వైద్యసేవలకు క్యూ కట్టిన రోగులు

వైద్యశిబిరం సందర్శన

పూసపాటిరేగ: మండలంలోని గుంపాం సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని కలెక్టర్ నాగలక్ష్మి ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు 380 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పి.అప్పలనాయుడు, మండలప్రత్యేక అధికారి శాంతాకుమారి, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ ఎం.రాధిక, ఐసీడీఎస్ పీఓ ఎస్తేరురాణి, కొవ్వాడ, గుంపాం సర్పంచ్‌లు కోట్ల రఘు, ఎడ్ల ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఇలా..

జిల్లా	మండలాలు	వైద్యశిబిరాలు	ఓపీ	వైద్యపరీక్షలు	రిఫరల్‌కేసులు
విజయనగరం	27	27	11,007	12,155	208
పార్వతీపురం మన్యం	15	17	7,857	3,443	176

క్లుప్తంగా

సెంచూరియన్‌లో విశ్వ సముద్ర సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన సలహాదారు రాజేంద్ర ప్రసాద్

నెల్లిమర్ల రూరల్: దేశంలో పోర్టులు, ప్రాజెక్టుల నిర్మాణంలో పేరు గాంచిన విశ్వ సముద్ర సంస్థ సిబ్బందికి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వ సముద్ర సంస్థ ప్రధాన సలహాదారు రాజేంద్ర ప్రసాద్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యువత పోటీతత్వం ఎదుర్కొనేలా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. పైలట్ ప్రాజెక్ట్ కింద సెంచూరియన్‌లో శిక్షణ ఏర్పాటు చేశామని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పల్లవి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు



కానిస్టేబుల్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

చీపురుపల్లి: ఢిల్లీలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఆత్మహత్యకు పాల్పడిన చీపురుపల్లి పట్టణంలోని రుంకానవీధికి చెందిన దాసరి నాగేశ్వరరావు అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. ఢిల్లీ నుంచి విమానంలో మృతదేహం బుధవారం అర్ధరాత్రి 1 గంట సమయానికి చీపురుపల్లి చేరుకోగా మృతదేహాన్ని చూసి భార్య, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు భోరున విలపించారు. దీంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనంతరం రుంకానవీధి శ్మశానవాటికలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు మృతదేహాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తదితరులు సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు.


మహిళకు తీవ్రగాయాలు



108లో మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని ఒప్పంగి గ్రామానికి చెందిన ఉత్తరావెల్లి పార్వతి బైక్‌పై నుంచి జారిపడి తీవ్రగాయాలపాలైంది. ఆమె రాజాం వెళ్లేందుకు గురువారం మోటార్‌సైకిల్ వెనుక కూర్చుని పయనిస్తోంది. ఆమె చీర కొంగు ద్విచక్రవాహనం వెనుక చక్రానికి చుట్టుకోవడంతో ఒప్పంగి సమీపంలో జారిపడి తీవ్ర గాయాలపాలైంది. ఈ ప్రమాదంలో ఆమె కుడి కాలు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో రేగిడి 108 ఈఎంటీ మీసాల ఈశ్వరరావు ప్రథమ చికిత్స అందించి, రాజాం ఆస్పత్రికి తరలించారు.

మద్యం సీసాలతో వ్యక్తి పట్టివేత



మద్యం బాటిల్స్‌తో వ్యక్తిని పట్టుకున్న పోలీసు సిబ్బంది

చీపురుపల్లి రూరల్/గరివిడి: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని గరివిడి పట్టణంలో ఎస్సై ఎల్. దామోదరరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పట్టుకున్నారు. పట్టణంలోని ఫేకర్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఎం.సాయిబాను అనే వ్యక్తి బుల్లెట్‌పై 50 మద్యం సీసాలు, 10 బీరు సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు

- ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులను పొందాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ కోరారు. ఎన్నో ప్రయోజనాలు కల్గించే ఈ గుర్తింపు కార్డులను సచివాలయాలు లేదా కామన్ సర్వీసు సెంటర్ నుంచి ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ శ్రమ్ పోర్టల్ ద్వారా యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎస్) కేటాయించి గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాలో 4,15,141 మంది అసంఘటిత రంగ కార్మికులున్నట్లు గుర్తించామని, వారంతా తక్షణమే తమ పేర్లను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రోజువారీ కూలీలు, కలాసీలు, హమాలీలు, రిక్షా కార్మికులు, మోటార్, భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసేవారు, రైతుకూలీలు, చిన్న సన్నకార రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, వీధి వ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారు, చిన్న వ్యాపారస్తులు, జాతీయ ఉపాధి హామీ కూలీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తూ గౌరవ భృతి పొందే అంగన్వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసేవారు, దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం లేనివారు, కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారంతా ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, గుర్తింపు కార్డులను పొందవచ్చునని తెలిపారు.

గుర్తింపు కార్డు ఉంటే ఆర్థిక సాయం

ఈ గుర్తింపుకార్డు కలిగి ఉండి, ప్రమాదవశాత్తు మరణించినా శాశ్వత అంగవైకల్యం పొందినట్లయినా, వారికి కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు ఆర్థిక సాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ విధంగా 2022 మార్చి 31లోగా మరణించిన శాశ్వత అంగవైకల్యం పొందిన వారి దరఖాస్తులను, డీఆర్‌డీఏ పీడీ, ఉపకార్మిక కమిషనర్, డీఎంహెచ్‌ఓ, ఎస్పీతో కూడిన కమిటీ పరిశీలించి, వాటిని అప్‌లోడ్ చేసే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు కలిగి ఉన్న అసంఘటిత కార్మికులు రేషన్ కార్డు లేకపోయినట్లయితే వెంటనే రేషన్ కార్డును జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. దీని ప్రకారం జిల్లా పౌరసరఫరాల శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దీనికోసం గ్రామ సచివాలయాల ద్వారా రేషన్ కార్డులు లేని అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికుల వివరాలను సేకరించి, పౌరసరఫరాల శాఖలు అందజేయాలని, గ్రామ వార్డు సచివాలయాల ఇన్‌చార్జ్ అధికారిని ఆదేశించామని తెలిపారు. అలాగే ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని రేషన్ కార్డులను ఇప్పించేందుకు కృషి చేయాలని కార్మిక శాఖను ఆదేశించారు.

పింఛన్ సదుపాయం

ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు కలిగి ఉన్నవారు ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ పథకం (పీఎంఎస్‌వైఎం) ద్వారా పింఛన్ సదుపాయాన్ని కూడా పొందవచ్చునని సూచించారు. బహుళప్రయోజనాలను కలిగించే ఈ గుర్తింపు కార్డులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఆధార్ నంబర్, ఆధార్ లింక్ అయిన సెల్ నంబర్, బ్యాంకు అకౌంట్ వివరాలను సచివాలయంలో సమర్పించి పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు కార్మిక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్ సెంటర్‌ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

2.310 కేజీల గంజాయి పట్టివేత

రాజాం సిటీ/సంతకవిటి: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామ సమీపంలో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని సంతకవిటి పోలీసులు గురువారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ముందస్తుగా అందిన సమాచారం మేరకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని జీఎంఆర్ గేటు ఎదురుగా ఉన్న టేకు తోటలో పట్టుకున్నామని ఎస్సై బుడుమూరు లోకేశ్వర రావు తెలిపారు. నిందితుడిని డోలపేట గ్రామానికి చెందిన కుప్పిలి నవీన్‌గా గుర్తించి 2.310 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

సారా రవాణాపై దాడులు

పార్వతీపురం టౌన్: సారా రవాణాపై దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రా ప్రాంతానికి సారా రవాణా జరుగుతోందన్న సమాచారంతో పార్వతీపురం మండలం ములగ గ్రామ సమీపంలో మాటువేసి 80లీటర్ల సారాతోపాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి తాన్నవలస గ్రామానికి చెందిన మండంగి చిన్నారావును అదుపులోకి తీసుకున్నారు. అలాగే పార్వతీపురం మండలం కృష్ణపల్లి సమీపంలో 160లీటర్ల సారాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్‌చేసి మున్సిపాల్టీలోని పాతరెల్లివీధికి చెందిన రాయిపల్లి జన్నును అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై వీవీ రమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్య కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు



సీతం కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ బాలికల ఎంపిక ప్రక్రియ

విజయనగరం అర్బన్: సత్య విద్యాసంస్థల కోసం బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ' ఎంపిక ప్రక్రియ స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగింది. ఎంపికకు సీతం, సత్య డిగ్రీ విద్యాసంస్థల బాలికలు 150 మంది పాల్గొనగా పరుగు పందెం, ఎత్తు, బరువు, మౌఖిక పరీక్ష, చేతులు, కాళ్ల కదలికల ఆధారంగా 50 మందిని ఎంపిక చేశారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర, సుబేదార్ మేజర్ రామదాత్, జీసీఐ సరిత పర్యవేక్షణలో ఈ ఎంపిక జరిగింది. ఎంపికైన బాలికలను సత్యా విద్యా సంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, డాక్టర్ సాయిదేవిమణి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎన్.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి ఎస్.ప్రశాంత్, సీఎస్ ఓసత్యనారాయణ, పీడీ మహేష్ పాల్గొన్నారు.

శారీరక, సాంకేతిక సమతుల్యంపై అవగాహన

పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'శారీరక, సాంకేతిక సమతుల్యం'పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరావు మాట్లాడుతూ శారీరిక మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని అలాగే విద్యార్థి దశ నుంచి అందరూ వ్యాయామం చేయాలని సాంకేతికతను సక్రమంగా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డీవీరామమూర్తి, మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

పార్వతీపురం: హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో భారత పర్యవేక్షక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ కోర్సులకు ఉచిత శిక్షణ నిర్వహిస్తుందన్నారు. డెమీచెఫ్ దపార్టీ, రెస్టారెంట్ కెప్టెన్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఐటీఐ ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్ల లోపు గల గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తి చేసిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ హోటల్‌లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9160912690, 9100558006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాలువలో జారిపడి కారు డ్రైవర్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు,(ఇన్‌సెట్‌లో) సుదర్శనరావు(ఫైల్)

రేగిడి: మండలంలోని పోరాం గ్రామ సమీపంలో గల మడ్డువలస కాలువలో జారిపడి శ్రీకాకుళం జిల్లా లోలుగు గ్రామానికి చెందిన నవిరి సుదర్శనరావు(30) గురువారం మృతిచెందాడు.పోరాం గ్రామానికి చెందిన బూరాడ విష్ణుమూర్తి కారు డ్రైవర్‌గా సుదర్శనరావు పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం విజయనగరం నుంచి పోరాం వచ్చిన సుదర్శనరావు మడ్డువలస ప్రధాన కుడికాలువలో స్నానానికి వెళ్లి, కాలువలో జారిపడ్డాడు. స్నానానికి వెళ్లిన వ్యక్తి ఎప్పటికీ రాకపోవడంతో విష్ణుమూర్తి కుటుంబసభ్యులు, స్థానికులు కాలువ వద్దకు వెళ్లి చూసి, గట్టుపై దుస్తులు, సెల్‌ఫోన్ ఉండడం గమనించారు. ఈ విషయం పోలీసులకు చేరవేయగా, ఫైర్ సిబ్బంది అక్కడికి వచ్చి తహసీల్దార్ సుదర్శనరావు ఆదేశాల మేరకు కాలువలో వెతికారు. కొద్ది దూరంలోనే సుదర్శనరావు మృతిచెంది కనిపించడంతో మృతదేహాన్ని బయటకు తీసి రేగిడి పోలీసులకు అప్పగించారు. వీఆర్‌ఓ ఏవీ సత్యనారాయణ శవపంచనామా నిర్వహించగా, రేగిడి పోలీసులు కేసునమోదు చేసి, రాజాం సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు సుదర్శనరావుకు ఐదునెలల క్రితమే వివాహం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మృతుడి భార్య అరుణతో పాటు బంధువులు సంఘటనా స్థలానికి వచ్చి భోరున విలపించారు.

ప్రజల వద్దకే వైద్యసేవలు

- ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



వృద్ధురాలికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌చంద్రదేవ్

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యులు ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి జల్లెడ పట్టి ప్రజలకు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు చేస్తారని చెప్పారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి నయమయ్యేంతవరకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్యసిబ్బంది ప్రజల వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేస్తారని దీర్ఘరోగాలు గుర్తిస్తే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తారన్నారు. ప్రజల ఆరోగ్య విషయంలో ముఖ్యమంత్రి రాజీలేకుండా, చికిత్స కోసం కోట్లాది రుపాయలైనా కేటాయిస్తున్నారని వివరించారు. పేదవాడికి రోగం శాపం కాకుండదని, చికిత్స కోసం ఏ పేదవాడు అప్పుల పాలు కాకూడదని ఒక్కరుపాయి కూడా ప్రజలతో ఖర్చుపెట్టనివ్వకుండా మీ సోదరుడు, మీ పెద్దకొడుకుగా బాధ్యత తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చికిత్సకు అయ్యే డబ్బంతా ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. ప్రజల కళ్లల్లో ఆనందం కోసం, ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన కోసం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఓ వైపు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, మరోవైపు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించారని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను, గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని పరిశీలించారు.

వైద్యాధికారులపై అసహనం

సుమారు 2500 మంది ప్రజలకు ఒకే వైద్యశిబిరం నిర్వహించడంపై ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మండిపడ్డారు. ఇంతమందికి ఒకే శిబిరం నిర్వహించడం ఏమిటని వైద్యాధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో తదుపరి సచివాలయాలకు సంబంధించి కనీసం మూడు ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారులతో తాను మాట్లాడతానని తెలిపారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారన్నారు. పట్టణంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 884మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, జర్జాపు ఈశ్వరరావు, గిరిరఘు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్, మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి డీవీఈఓ మంజులవీణ, కమిషనర్ జయరాం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- 30 నుంచి చిత్తూరులో అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా బాల, బాలికల జట్లు



బాలుర జట్టు ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: విద్యార్థి దశలో క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జిల్లా స్థాయిలో ఉత్సాహ భరిత వాతావరణంలో సాగుతున్నాయి. ఈ మేరకు గురువారం అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికల విభాగాల్లో నిర్వహించిన వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ అభ్యసిస్తున్న 300 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను జిలా జట్టులోకి ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు పీవీఎల్‌ఎన్ కృష్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30 నుంచి చిత్తూరు జిల్లాలో జరగనున్న అండర్-19 బాల, బాలికల రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణంరాజు, నల్లా వెంకటనాయుడు, టీవీ భగవాన్‌దాస్, కేవీఎస్‌రాజు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

జేఏఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ సి. విష్ణుచరణ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కౌంటర్లను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిపుణులైన వైద్యులతో ప్రజలకు అవసరమైన తనిఖీలు, పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జేఏఎస్ కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ పథకం పేదల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యసిబ్బంది రోగులకు అవసరమైన తనిఖీలు నిర్వహించారు.

వెంకట్రామా పొల్ట్రీస్‌లో వేతన ఒప్పందం



పరిశ్రమ ఎదుట కార్మికులతో మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం పరిసరాల్లో ఉన్న వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమలో యాజమాన్యం, కార్మికుల మధ్య వేతన ఒప్పందం జరిగింది. ఈ మేరకు గురువారం పరిశ్రమ ఎదుట సీఐటీయూ అనుబంధంతో గంగా భవాని వెంకట్రామా పౌల్ట్రీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 200 మంది కార్మికులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎ.సన్యాశినాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ధర్నా వద్దకు చేరుకుని పరిశ్రమ యాజమాన్యం, కార్మికులతో చర్చలు జరిపారు. దీంతో ఇరువర్గాల మధ్య నూతన వేతన ఒప్పందం అమల్లోకి వచ్చినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి టీవీ.రమణ తెలిపారు. నూతన ఒప్పందం ప్రకారం పరిశ్రమలో 200 మంది కార్మికులకు రూ.1900 నుంచి రూ.3,200 వరకు వేతనాలు పెరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధి అంబళ్ల గౌరునాయుడు, వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు గురునాయుడు, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు లోక్‌సత్తా అభినందనలు

విజయనగరం పూల్‌బాగ్: మహాకవి, ఆధునిక చరిత్రకారుడు, తెలుగు జాతికి వెలుగు చూపిన గురజాడ అప్పారావు నివసించిన గృహంపై ప్రత్యేక శ్రద్ధతో భవన నిర్వహణకు ప్రతి నెలా రూ.10 వేలు మంజూరు చేస్తూ జెడ్పీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నందుకు లోక్ సత్తాపార్టీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటోందని ఆ పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం అన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు 161 వ జయంతి సందర్భంగా లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ జిల్లా కలెక్టర్ ముందు అనేక ప్రతిపాదనలు పెట్టారని ముఖ్యంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గురజాడ గృహం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చిన్నపాటి రేకుల షెడ్ వేస్తే సాహిత్య సభలు నిర్వహించడానికి అవకాశం ఉంటుందని, చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంటుందని, డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావును కలిసి గురజాడ గ్రంథాలయం ఆవరణలో ఉన్న గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో ప్రేక్షకులకు ఇబ్బందులు లేని విధంగా షెడ్ వేయాలని, గురజాడ ఇంటిని అధునికీకరించి టూరిజం కేంద్రంగా చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ కార్పొరేషన్ కార్యదర్శి పీఎల్ఎన్.రాజు, పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు పాల్గొన్నారు.

బల్లంకిలో రూ.55 వేలు పలికిన గణేశ్ లడ్డు



వేలంపాటలో సొంతం చేసుకున్న లడ్డుతో అబద్ధం

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామం న్యూకాలనీలో యూత్, గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక లడ్డు వేలం పాటలో గ్రామానికి చెందిన పట్టన అబద్ధం రూ.55 వేలకు పాడి లడ్డును సొంతం చేసుకున్నాడు. వినాయక మంటపం వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన వేలంలో 15 కేజీల లడ్డుతో పాటు పావుతులం బంగారానికి నిర్వహించిన వేలం పాటను అబద్ధం కైవసం చేసుకోవడంతో కమిటీ సభ్యులు పాటదారుకు లడ్డు, బంగారం అందచేశారు. అనంతరం గ్రామంలో వినాయకుని ఊరేగింపు నిర్వహించి తెల్లవారుజామున నిమజ్జనం చేశారు.

ఐడీ కార్డుల పంపిణీ



ఐడీ కార్డులను అందజేస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణారావు

పార్వతీపురం: నాయీ బ్రాహ్మణ సేవాసంఘం ఐడీ కార్డులను బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్. కృష్ణారావు తన కార్యాలయంలో సంఘం సభ్యులకు గురువారం అందజేశారు. ఈ మేరకు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ జిల్లా సభ్యులు పట్నాన రవిశంకర్, బూర్జి రమణ, టి.వరప్రసాద్, ఎం. భవానిలను ఎంపిక చేసి వారికి ఐడీ కార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ అధికారి మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషిచేయాలని సభ్యులకు సూచించారు. ఆయనతోపాటు సూపరింటెండెంట్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.